క్లుప్తంగా

పరామర్శ



పరామర్శిస్తున్న ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ కోఆప్షన్ సభ్యుడు ఆశిక్ హుస్సేన్ తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో జిల్లా ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకున్నారు. ఆయన వెంట సిర్పూర్(టి) మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్, నాయకులు అఖిల్ అహ్మద్, ఇఫాత్‌హుస్సేన్ తదితరులు ఉన్నారు.

22 నుంచి ముక్కోటి ఏకాదశి మహోత్సవం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో గల శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు ముక్కోటి ఏకాదశి మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ పదాధికారులు తెలిపారు. 23న వైకుంఠద్వార దర్శనం కార్యక్రమం, 24న ఉదయం 11.50 గంటలకు శ్రీ లక్ష్మీనారాయణుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. 22 నుంచి 24 వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఖమానలో పశువైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి శివ ప్రసాద్ పాడి పశువులకు వైద్య పరీక్షలు చేశారు. పశువుల్లో వచ్చే గర్భకోశ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెందుర్ పవన్, వైద్య సిబ్బంది గణపతి, రాజు, నరేశ్, రమేశ్, బాలాజీ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

యాసంగి పంటల నమోదు



పంట వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో

జైనూర్: ప్రభుత్వ ఆదేశానుసారం యాసంగిలో రైతులు పండించే పంటల వివరాలను సేకరించి నమోదు చేస్తున్నట్లు ఏఈవో వినోద అన్నారు. మంగళవారం మండలంలోని గూడ మామడ గ్రామంలో రైతుల వద్దకు వెళ్లి పంట నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. యాసంగిలో పండించే ప్రతీ పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుడమామడ సర్పంచ్ కేశవ్‌రావు, రైతులు, తదితరులు ఉన్నారు.

'ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం'



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు

జైనూర్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి శ్యామ్‌నాయక్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ, ఎంపీ టికెట్ వస్తుందనే ఆశతో బీఆర్‌ఎస్‌ను విమర్శిస్తే తగిన గుణపాఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి భీంరావు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ, సర్పంచులు, నాయకులు ఉన్నారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రత్యేక కృషి

ఇచ్చోడ: నియోజవకర్గంలో మైనార్టీల అభివృద్ధికి కోసం తనవంతు ప్రత్యేక కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జామ మసీద్‌లో నిర్వహించిన ఆత్మీయ సన్మాన సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. మైనార్టీల అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నానన్నారు.



దహెగాం: స్వెటర్ వేసుకొని రోడ్లు ఊడుస్తున్న జీపీ కార్మికుడు



పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో చలిమంట కాగుతున్న యువకులు



దహెగాం: స్కార్ఫ్ చుట్టుకున్న మహిళ



దహెగాం: స్వెటర్‌తో పొలానికి వెళ్తున్న రైతు

వామ్మో చలి..!

జిల్లాలోని ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. ఉదయం పూట వామ్మో చలి అంటూ ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. చిన్నారులు, వృద్ధులు మరింతగా అవస్థలు పడుతున్నారు. చలి నుంచి రక్షణకు ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. పల్లెల్లో చలి మంటలు కాగుతున్నారు. ఉదయం పది గంటలు దాటినా చలి తగ్గడం లేదని వాపోతున్నారు. మరో రెండు రోజులు ఈదురుగాలులు వీస్తాయని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

– దహెగాం/పెంచికల్‌పేట్

యూడైస్ పత్రాల పరిశీలన

తిర్యాణి: పాఠశాలకు సంబంధించిన అన్ని వివరాలను యూడైస్ పత్రాల్లో పొందుపర్చాలని జిల్లా అసిస్టెంట్ స్టాటికల్ కో ఆర్డినేటర్ అబిద్ అలీ అన్నారు. యూడైస్ పత్రాల ఆధారంగా పాఠశాలలకు అవసరమయ్యే వసతులు, సౌకర్యాలను ప్రభుత్వం పొందుపరుస్తుందన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించి వారిని భవిత కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు.

1న ఆనంద్ మేళా

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు క్రీడా మైదానంలో ప్రతీ ఏడాది మాదిరి జనవరి 1న ఆనంద్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మోక్షిత డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు సంతోష్ తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రతిభ కలిగిన విద్యార్థులను సన్మానించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు, తాలుకా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బస్సు పునరుద్ధరణ ఎప్పుడో..?

- ఆసిఫాబాద్ నుంచి తిర్యాణికి నిలిచిన బస్సు సేవలు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు



ఆర్టీసీ డిపో అసిస్టెంట్ డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీసేన నాయకులు (ఫైల్)

తిర్యాణి: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి నడిచే రెండు ఆర్టీసీ బస్సు సర్వీసులను రోడ్డు బాగా లేదని, ఆదాయం రావడం లేదనే కారణాలతో గత 6 నెలల క్రితం నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. బస్సు సర్వీసును పునరుద్ధరించాలని ఇప్పటికే మండలవాసులు పలుమార్లు ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

బస్సు సర్వీసు నిలిచిపోవడంతో తిప్పలు..

జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రం వరకు వివిధ పనుల రీత్యా వందల సంఖ్యలో ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. సొంత వాహనాలు లేని వారికి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం వెళ్లడానికి ఆర్టీసీ బస్సు ప్రధాన ఆధారంగా ఉంది. కాగా జిల్లా కేంద్రం నుంచి మండలంలోని మంగి, రోంపెల్లి గ్రామానికి వెళ్లే రెండు బస్సు సర్వీసులు గతంలో కురిసిన వర్షాలతో తాత్కాలికంగా రద్దు చేశారు. కాగా వర్షాకాలం ముగిసిన తర్వాత ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరిస్తామని అధికారులు పలుమార్లు పేర్కొన్నారు. కానీ వానాకాలం ముగిసినా సర్వీసును ప్రారంభించకపోవడంతో తిప్పలు తప్పడం లేదు.

రద్దుకు పలు కారణాలు..

బస్సు సర్వీసులు నిలిచిపోవడానికి ప్రధాన కారణం జిల్లా కేంద్రం నుంచి మండలానికి వెళ్లే రోడ్డు. రోడ్డు సరిగా లేకపోవడం.. గతంలో కురిసిన వర్షాలకు పలుచోట్ల రోడ్డు కోతకు గురి కావడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో అధికారులు బస్సు సర్వీసును ప్రారంభించడం లేదు. బస్సు సేవలు నిలిచిపోవడంతో ప్రయాణికులు అధిక చార్జీలు చెల్లించి ప్రైవేట్ వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టి బస్సు సర్వీసును తిరిగి ప్రారంభించడం ద్వారా దంతన్‌పెల్లి, భీంజిగూడ, పంగిడిమాదర, గిన్నెధరి, సుంగాపూర్, నాయకపుగూడ, రాళ్ల కన్నెపెల్లి, తలండి, తిర్యాణి, చెలిమల, మాణిక్యపూర్, రోంపెల్లి, మెస్రంగూడ, మంగి వంటి మారుమూల గ్రామాలకు రాకపోకలు సులభతరమవుతాయి. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

మస్తు కష్టమవుతుంది..



జిల్లా కేంద్రం నుంచి రొంపెల్లి వరకు నడిచే బస్సు సర్వీసును అధికారులు నిలిపివేయడంతో జిల్లా కేంద్రానికి, రొంపెల్లికి వెళ్లాలంటే మస్తు కష్టమవుతుంది. ప్రస్తుతం బస్సు నడిచే పరిస్థితి ఉన్నా ఆర్టీసీ అధికారులు సర్వీసును నడిపించేందుకు చొరవ చూపకపోవడం సరికాదు.

– సొర రమేశ్ గౌడ్, గడల పెల్లి

అధికారులకు విన్నవించాం..



బస్సు సర్వీసు పునరుద్ధరణ కోసం ఇటీవల ఆదివాసీ సేన సంఘం ఆధ్వర్యంలో అసిస్టెంట్ డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశాం. రూట్ చెక్ చేసి త్వరలోనే సర్వీసు ప్రారంభిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పది రోజుల్లో ప్రారంభించకుంటే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– కోట్నాక గణపతి, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు

బస్సు పునరుద్ధరణకు కృషి చేస్తాం

జిల్లా కేంద్రం నుంచి రొంపెల్లి వరకు ఉన్న బస్సు సేవలను రోడ్డు సరిగా లేకపోవడంతో వర్షాకాలం ముందు తాత్కాలికంగా రద్దు చేశాం. త్వరలోనే రూట్ చెక్ చేసి సర్వీసును పునరుద్ధరిస్తాం. గతంలో ఈ రూట్‌లో ఆదాయం కూడా చాలా తక్కువగా వచ్చింది.

– శ్రీధర్, డీఎం, ఆసిఫాబాద్

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కృష్ణారావు

కౌటాల: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. కౌటాల సహకార సంఘం కార్యాలయం ఎదుట సోమవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, సీఈవో రాజేశ్, సర్పంచ్ మౌనిశ్, ఉప సర్పంచ్ తిరుపతి, ఏఈవో ఘనాశ్యాం, డైరెక్టర్లు ఎల్లయ్య, శైలేష్, శంకర్, నాయకులు వాసుపటేల్, మల్లయ్య, రవీందర్ గౌడ్, మృత్యుంజయ్, చందు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ చైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. మండలంలోని రవీంద్రనగర్–1లో మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. ఆయన వెంట జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి, సీఈవో రాజేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తాంబిరే తిరుపతి, వైస్‌ఎంపీపీ మనోజిత్, ఏవో రామకృష్ణ, ఏఈవోలు, బీజేపీ నాయకులు ఎల్ములే మల్లయ్య, సుధాకర్, చందు, నవీన్ రైతులు పాల్గొన్నారు.

'పెత్తందార్లకు కొమ్ముకాసే సంఘాలకు బుద్ధి చెప్పాలి'



మాట్లాడుతున్న వీరభద్రయ్య

రెబ్బెన: పైరవీలకు అలవాటు పడి పెత్తందార్లకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వ సంఘాలకు బుద్ధి చెప్పాలని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే.వీరభద్రయ్య అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో ఏఐటీయూసీ గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హక్కుల సాధనలో ఏఐటీయూసీది అలుపెరుగని పోరాటమన్నారు. కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టిన ఘనత ఎర్రజెండా ఏఐటీయూసీదని పేర్కొన్నారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా పైసాతోనే పని అన్నట్లుగా వ్యవహరిస్తూ స్వలాభం కోసమే పాటుపడే టీబీజీకేఎస్‌ను మరోసారి నమ్మి కార్మికులు మోసపోవద్దన్నారు. సింగరేణి కార్మికులంతా ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. సమావేశంలో గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, బ్రాంచి ఉపాధ్యక్షుడు మొగిళి, సీహెచ్‌పీ ఫిట్ కార్యదర్శి ఎంబడి రాజయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కే.కిరణ్, మీస చంద్రశేఖర్, ఆనంద్, రాజయ్య, ఫిట్ కార్యదర్శులు రఘునాథ్, నాయకులు జహీర్, శ్రీనివాస్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఎన్నికలు యథావిధిగా జరపాలి



మాట్లాడుతున్న ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

రెబ్బెన: సింగరేణిలో ఈనెల 27న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికలను యథావిధిగా నిర్వహించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. మంగళవారం మాదారం టౌన్‌షిప్ సివిల్ డిపార్టుమెంట్‌తో పాటు గోలేటి డిస్పెన్సరీ, ఏరియా స్టోర్స్, ఏజెంట్ ఆఫీస్, వృత్తి శిక్షణ కేంద్రంలో గేట్ మీటింగ్‌లు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతో గుర్తింపు సంఘం ఎన్నికలను వాయిదా వేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. కార్మిక లోకమంతా మరోసారి టీబీజీకేఎస్‌ను గుర్తింపు సంఘంగా ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్మిక హక్కుల రక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న టీబీజీకేఎస్‌ను కార్మికులు మరోసారి ఆదరించాలన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ చొరవతో వారసత్వ ఉద్యోగాలు, లాభాల వాటా 32 శాతానికి పెంపు, వడ్డీ లేని గృహ రుణం, కార్మిక క్వాటర్లలో ఏసీలకు అనుమతితో పాటు కార్మిక సంక్షేమం కోసం ఎన్నో పథకాలను తీసుకొచ్చామని తెలిపారు. జాతీయ కార్మిక సంఘాల నాయకుల మాటలు నమ్మి కార్మికులు మోసపోవద్దన్నారు. సమావేశంలో టీబీజీకేఎస్ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావు, చర్చల ప్రతినిధి మంగీలాల్, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి కుమారస్వామి, ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, ఏరియా నాయకులు రాజేశం, కిరణ్, ఏరియా స్టోర్ అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి గణపతి, శ్రీనివాస్, కమిటీ సభ్యురాలు కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

కాగజ్‌నగర్‌టౌన్: సమగ్రశిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేసేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరుతూ మంగళవారం తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి ఉద్యోగులందరికీ రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు, ఆరోగ్య బీమా రూ.5 లక్షల సౌకర్యాన్ని కల్పించాలని, విద్యాశాఖ నియామకాలలో వెయిటేజీ కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నార్నూర్: స్వయం సహాయక సంఘం మహిళా సభ్యులు, బ్యాంకు ఖాతాదారులు నగదు రహిత లావాదేవీలపై అవగాహన తప్పని సరిగా కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు భీంపూర్ బ్రాంచి మేనేజర్ రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజులగూడ గ్రామంలోని వివేకానంద పాఠశాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు, నాబార్డు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో లావాదేవీలు ఎలా జరపాలి, పలు బీమా పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో సీపీఎస్ పాయింట్‌లను ఏర్పాటు చేస్తామన్నారు.

శనగలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

జైనథ్: శనగ పంటలో అవసరమైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఈవో తౌసీఫ్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి శనగ పంటలను పరిశీలించి మాట్లాడారు. అక్కడికక్కడ శనగలో ఎండు తెగులు కనిపిస్తున్నందున రైతులు 200లీటర్ల నీటిలో 600గ్రాముల బ్లూ కాపర్, 20గ్రాముల ప్లాంటమైసిన్‌ను కలిపి ఎకరం విస్తీర్ణంలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. శనగలో పచ్చ పురుగు నివారణకు 200లీటర్ల నీటిలో 2.5 ఎంఎల్ క్లోరోపైరిపాస్‌ను కలిపి పిచికారీ చేసుకుంటే ఫలితం ఉంటుందన్నారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'



డీసీసీ అధ్యక్షుడితో ఆదివాసీ పటేళ్లు

ఆసిఫాబాద్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద రావు అన్నారు. వాంకిడి మండలానికి చెందిన ఎనిమిది గ్రామాల పటేళ్లు మంగళవారం జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడి నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి విశ్వప్రసాదరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మసాదే చరణ్, ఎన్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆసిఫ్ అలీ, నాయకులు మునీర్ అహ్మద్, శ్రీను, మంగ, జావీద్ పాల్గొన్నారు.

'భూమి పట్టాకు లంచం డిమాండ్'



ఆరోపిస్తున్న సువర్ణ, విలాస్

చింతలమానెపల్లి: కొనుగోలు చేసిన భూమిని పట్టా చేయడానికి తహసీల్దార్ లంచం డిమాండ్ చేసినట్లు మండలంలోని గంగాపూర్‌కు చెందిన బాధితులు మంగళవారం ఆరోపించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగాపూర్ గ్రామశివారులో గాందర్ల కిష్టయ్య అనే వ్యక్తికి సర్వే నంబరు 60/ఏలో 2 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా 70 గుంటల భూమిని రెండేళ్ల క్రితం 2 నుంచి 5 గుంటల చొప్పున గ్రామంలోని 15 మందికి విక్రయించాడు. కొనుగోలు దారులు భూమి రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించగా, కొందరిని గుంటకు రూ.1500 చొప్పున, మరికొందరిని రూ.8వేల చొప్పున స్థానిక ఆకాష్ ఆన్‌లైన్ సెంటర్‌లో అదనంగా చెల్లించాలని తహసీల్దార్ నాగరాజు గౌడ్ పేర్కొన్నారు. దీంతో దరఖాస్తు చేసుకున్న 15 మందిలో 14 మంది డబ్బులు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. మూడు రోజుల కిందట భూమి రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా మంగళవారం 11 మందికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పూర్తి చేసి సంబంధిత పత్రాలు సైతం అందజేశారు. మిగిలిన వారి రిజిస్ట్రేషన్ నిలిపివేశారు. కాగా గంగాపూర్ గ్రామ సర్పంచ్ గొమాసే విలాస్, తన భార్య గొమాసే సువర్ణ సైతం భూమి కొనుగోలు చేసినా లంచం ఇవ్వకపోవడంతో రిజిస్ట్రేషన్ నిలిపివేసినట్లు వారు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్‌ను సువర్ణ ప్రశ్నించగా పరుషంగా మాట్లాడినట్లు ఆమె ఆవేదన వెలిబుచ్చింది.

తహసీల్దార్‌పై తీవ్ర ఆరోపణలు..

స్థానిక తహసీల్దార్ నాగరాజు స్థానికంగా ఉన్న ఆన్‌లైన్ సెంటర్ల నిర్వాహకులతో కుమ్మక్కై రైతులు, విద్యార్థులు, లబ్ధిదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ నగదు చెల్లించిన వారికే పనులు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ నాగరాజును సంప్రదించగా ఆన్‌లైన్ సెంటర్ల నియంత్రణ తన చేతుల్లో లేదని బయట ఏం జరిగినా తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వాంకిడి: మండలంలోని సరాండి, ఖమాన గ్రామాల్లో మంగళవారం 'వికసిత్ భారత్ సంకల్ప యాత్ర'లో భాగంగా మండల అధికారులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, బ్యాంకు, వైద్య శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతీ ఒక్కరు పథకాలపై అవగాహన కలిగి ఉంటే లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ నందకృష్ణ, ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్, వ్యవసాయ విస్తరణ అధికారి మానస, తదితరులు పాల్గొన్నారు.